క్లుప్తంగా

రీ సర్వే సమస్యలను పరిష్కరించుకోండి



మాట్లాడుతున్న తహసీల్దార్ శివరాముడు

ఆదోనిరూరల్: రీ సర్వేలో నెలకొన్న భూ సమస్యలను గ్రామసభల ద్వారా అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని తహసీల్దార్ శివరాముడు అన్నారు. గురువారం మండలంలోని చిన్నగోనేహాల్ గ్రామంలో రీ సర్వేపై గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలను అర్జీల రూపంలో స్వీకరించారు. సమస్యలను విచారించి త్వరలోనే పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



మల్లికార్జునతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

ఆదోని రూరల్: మండలంలోని పెద్దహరివాణం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతన్న బి.మల్లికార్జున అనే విద్యార్థి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం రమణమూర్తి, వ్యాయామ ఉపాధ్యాయుడు రామన్న తెలిపారు. ఈ మేరకు గురువారం ఎంపికైన విద్యార్థిని స్థానిక పాఠశాలలో అభినందించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రస్థాయి అండర్-14 ఎస్‌జీఎఫ్ కబడ్డీ పోటీలు బాపట్లలో ఈనెల 9వ తేదీ నుంచి 16వ తేదీ వరకు జరుగుతాయన్నారు. కర్నూలు జిల్లా నుంచి మల్లికార్జున ప్రాతినిధ్యం వహిస్తాడన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ చైర్మన్ రమేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో క్రమశిక్షణ



స్కౌట్స్ అండ్ గైడ్ వ్యవస్థాపకులు బెడెన్, పావెల్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న హెచ్ఎం

ఎమ్మిగనూరుటౌన్: స్కౌట్స్ అండ్ గైడ్‌తో విద్యార్థుల్లో క్రమశిక్షణతో పాటు సేవాభావం అలవడుతుందని స్థానిక ఎంఎస్ బాలికల జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం కృష్ణమూర్తి అన్నారు. 75వ భారత్ స్కౌట్స్ అండ్ గైడ్ ఫ్లాగ్ డేను గురువారం పాఠశాలలో విద్యార్థినులతో కలిసి నిర్వహించారు. ఇందులో భాగంగా స్కౌట్స్ అండ్ గైడ్ వ్యవస్థాపకులు బెడెన్, పావెల్ చిత్రపటాలకు ఆయనతో పాటు గైడ్ కెప్టెన్లు సుజనకుమారి, లక్ష్మిదేవి పూలమాల వేసి నివాళులర్పించి, పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం స్థానిక ఉర్దూ హైస్కూల్, ప్రాథమిక పాఠశాల హెచ్ఎంలకు , ఉపాధ్యాయులకు విద్యార్థులు ఫ్లాగ్‌లను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఎండీఎం శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

పట్టణ అభివృద్ధికి కృషి



పట్టణంలో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణ అభివృద్ధికి తమ వంతుగా కృషి చేస్తామని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని స్టేట్‌బ్యాంక్ , శ్రీనివాస సర్కిల్, సోమేశ్వర థియేటర్, ఆర్‌సీఎం చర్చి ప్రాంతం , గంజిల్ల రోడ్డు తదితర ప్రాంతాల్లోని రోడ్లను పరిశీలించారు. పట్టణంలోని ఓ వార్డు పరిధిలో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

నందవరం : మండలంలో నాగలదిన్నె గ్రామంలో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి భూమిపూజ చేశారు. గ్రామంలోని వరద కాలనీ రూ.9 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం గ్రామంలో పర్యటించారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలను పరిశీలించారు.

శ్రీ మఠంలో పత్తికొండ మాజీ ఎమ్మెల్యే



ప్రదక్షిణలు చేస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి గురువారం మంత్రాలయం వచ్చారు. వీరు ముందుగా గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్రస్వామి మూలబృందావనంకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఆమెకు శ్రీ మఠం అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేసి ఆశీర్వాదించారు.

- పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కరువు
- రుచి శుచీలేని మధ్యాహ్న భోజనం
- ఇంటి నుంచి క్యారియర్లు తెచ్చుకుంటున్న విద్యార్థులు
- విద్యా పథకాలు అమలుకాక తల్లిదండ్రుల అవస్థలు

బడి.. సమస్యల ఒడి



కందనాతి పాఠశాలలో రేకుల షెడ్డే వంటగది



గోనెగండ్లలో వడ్డిస్తున్న నీళ్లచారు

ఎమ్మిగనూరు: సర్కారు స్కూళ్లలో కనీసవసతులు కరువయ్యాయి. పాఠశాలలు తెరిచి నాలుగు నెలలు గడిచినా ఎక్కడి సమస్యలు అక్కడే తిష్టవేశాయి. భవన నిర్మాణాలు మధ్యలో నిలిచిపోయాయి. మరుగుదొడ్ల శుభ్రత లోపించింది. అమ్మకు వందనం అంటూ తల్లులను దగా చేసింది. నాణ్యమైన మద్యమంటూ గొప్పలు చెప్పుకోవడమే సరిపోయిందిగానీ, పేద విద్యార్థులకు నాణ్యమైన భోజనం మాత్రం కరువైంది. బడిలో ఒకపూట నాణ్యమైన భోజనం తినే ఆ విద్యార్థులు ఆకలికేకలతో అలమటించే రోజులు దాపురించాయి. సగమంది పిల్లలు ఇంటినుంచే భోజనం తెచ్చుకొనే సంస్కృతి మొదలయ్యింది. మొత్తం మీద ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసే చర్యలు మొదలయ్యాయంటూ విద్యావేత్తలు ఆందోళన చెందుతున్నారు.

మధ్యాహ్న భోజనంలో తగ్గిన నాణ్యత

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నియోజకవర్గంలోని పాఠశాలల్లో మధ్యాహ్న భోజన ఏజెన్సీలు, స్కావెంజర్ల కడుపులు కొట్టి పచ్చచొక్కాల నాయకులకు నిర్వాహణను అప్పగించింది. దీంతో మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపించడంతో విద్యార్థులు తినేందుకు ఆసక్తి చూపడంలేదు. ఎమ్మిగనూరు పట్టణంతో పాటు మండలంలో 87 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలుండగా ఆయా పాఠశాలల్లో 23,763 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. గోనెగండ్ల మండలంలో 55 పాఠశాలల్లో 10,900 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. కొన్ని ఉన్నత పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో నాణ్యత కొరవడటంతో విద్యార్థులు ఇళ్ల నుంచి క్యారియర్లు తెచ్చుకొని తింటున్నారు. దాదాపు పది నుంచి 15 శాతం విద్యార్థులు ఇంటి భోజనంపైనే మక్కువ చూపుతున్నారు. నందవరం మండలంలో 42 పాఠశాలల్లో 9,011 మంది విద్యార్థులు ఉండగా వారిలో 7వేల మంది పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం చేస్తున్నారు. మిగిలిన వారిలో కొందరు ఇళ్ల నుంచి క్యారియర్లు తెచ్చుకొని, కొందరు ఇళ్లకు వెళ్లి తినివస్తున్నారు.

గుడ్డును మింగేశారు..

గోనెగండ్ల మండలంలోని కొన్ని పాఠశాలలకు దసరా సెలవులనంతరం మధ్యాహ్న భోజనంలో గుడ్ల పంపిణీ చేయడం లేదని అధికారులే పేర్కొంటున్నారు. ఎమ్మిగనూరు మండలంలోని కందనాతి గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఎంపీపీ డెపెప్ స్కూల్లో 1 నుంచి 5వ తరగతి వరకు 102 మంది విద్యార్థులు చదువుకుంటుండగా వారిలో 80 మంది మాత్రమే విద్యార్థులు మధ్యాహ్న భోజనం తింటున్నారు. పాఠశాలలో వంట ఏజెన్సీలు వంట గది లేకపోవటంతో పాతదానికి రేకుల షెడ్‌ల వేసుకొని అందులోనే వంటలు తయారు చేస్తున్నారు. భారీ వర్షాలు వస్తే వంట చేయటానికి నానా అవస్థలు పడాల్సి వస్తోందని నిర్వహకులు చెపుతున్నారు.

సంవత్సరం నుంచి ఒక్కరే ఉపాధ్యాయుడు

పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండగా ఈ సంవత్సరం జనవరి నుంచి ఒక ఉపాధ్యాయురాలు ప్రమోషన్‌కోసం ఉన్నత చదువుల కోసం సెలవులో ఉంది. అప్పటి నుంచి ఒక్కరే ఉపాధ్యాయుడు బోధన చేస్తున్నారు. విద్యాశాఖ అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా తమ సమస్యకు పరిష్కారం చూపటం లేదని ఉపాధ్యాయుడు సురేష్ చెపుతున్నారు. పాఠశాలలు ఓపెన్ అయినప్పటి ఉంచి బాత్ రూములు శుభ్రం చేసేందుకు రసాయనాలు రాలేదు. కడివెళ్ల గ్రామంలో ఎంపీపీ స్కూల్లో 266 మంది విద్యార్థులు ఉన్నారు. మరుగుదొడ్ల శుభ్రం చేసే రసాయనాలు రాకపోవటంతో తామే కూలీ మనిషిని పెట్టి చేయిస్తున్నామని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

వైఎస్ జగన్ హయాంలో విద్యారంగానికి పెద్దపీట

గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో విద్యారంగానికి పెద్దపీట వేశారు. నాడు–నేడు పనుల ద్వారా నియోజకవర్గంలో మొదటి విడతలో రూ.25.21కోట్లతో 74 పాఠశాలలను, రెండవ విడతలో రూ.66.5కోట్లతో 111 ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరించి రూపురేఖలే మార్చారు. ఐదేళ్లలో అమ్మఒడి ద్వారా 39,066 మందికి రూ.178.35కోట్లు అందించారు. అలాగే జగనన్న విద్యాదీవెన ద్వారా 20,233మందికి రూ.53.80కోట్లు, వసతిదీవెన ద్వారా ది5,421 మందికి రూ.23.45కోట్లు, విదేశీ విద్యా దీవెన ద్వారా 150 మందికి రూ.71లక్షలు అందించి పేద విద్యార్థులకు నాడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా ఇచ్చారు. నేడు ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి పేద విద్యార్థులకు, వారి తల్లులకు ఇచ్చే పథకాలు మాయమయ్యాయి.

పిల్లల చదవులకు కష్టంగా ఉంది



మాకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. ముగ్గిరినీ ప్రైవేటు పాఠశాలలో చదివిస్తున్నాం. చంద్రబాబు ప్రతి పిల్లోడికి రూ.15 వేలు ఇస్తామని చెప్పడంతో సంతోష పడ్డాం. ఇప్పటివరకు ఆ డబ్బు మంజూరు చేయలేదు. ఫీజులు కట్టమని పాఠశాల టీచర్లు ఒత్తిడి చేస్తున్నారు. తల్లికి వందనం డబ్బు రాకపోవడంతో చాలా ఇబ్బంది పడుతున్నాం. అప్పులుచేసి పిల్లలను చదివించాల్సి వస్తోంది.

– లక్ష్మిదేవి, నందవరం

విద్యావ్యవస్థను నిర్లక్ష్యం చేస్తున్నారు

తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యా వ్యవస్థను పూర్తి నిర్లక్ష్యం చేస్తున్నారు. తల్లికి వందనం, విద్యాదీవెనలు లేక పేదవిద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కార్పొరేట్ ప్రయోజనాల కోసం ప్రభుత్వ విద్యను నిర్లక్ష్యం చేయడం తగదు. మధ్యాహ్న భోజనంలో నాణ్యతలేదు. పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కరువయ్యాయి.

– వీరేష్‌యాదవ్, ఎస్ఎస్‌యూవి జిల్లా అధ్యక్షుడు

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు చేయించుకోవాలి



గర్భిణులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని టౌన్: ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు చేయించుకోవాలని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సూచించారు. ఆదోని ప్రభుత్వ మాతాశిశు సంరక్షణ కేంద్రాన్ని గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆస్పత్రికి వచ్చిన గర్భిణులు, బాలింతలను పలకరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో వైద్యసేవలు సకాలంలో అందిస్తున్నారా లేదా, ప్రసవాలు బాగా చేస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ప్రసవం కోసం వచ్చిన గర్భిణులను వివిధ కారణాలచేత వెనక్కి పంపడం, రేపు రా మాపు రా అంటూ తిప్పుతున్నారా అని ఆరాతీశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ మాధవీలత, వైద్యసిబ్బంది ఉన్నారు.

సలకలకొండ గ్రామంలో సబ్‌కలెక్టర్ పర్యటన

ఆదోనిరూరల్: మండలంలోని సలకలకొండ గ్రామాన్ని గురువారం అధికారులతో కలిసి సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సందర్శించారు. గ్రామంలో తాగునీటి సమస్యలపై ప్రజలను ఆరాతీశారు. ఏవైనా సమస్యలు ఉంటే తనదృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులను పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. మధ్యాహ్న భోజనం అందుతుందా, భోజనం ఎలా ఉంటుందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

శ్రీ మఠానికి రూ.లక్ష విరాళం

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో జరిగే సంపూర్ణ సేవ కార్యక్రమానికి బెంగళూరుకు చెందిన మాయభూషణ్ అనే భక్తుడు గురువారం లక్ష రూపాయాలను విరాళంగా అందజేశారు. దాతకి శ్రీ మఠం అధికారులు శేషవస్త్రం, స్వామి వారి మొమెంటో, పరిమళ ప్రసాదం అందజేశారు.

13న సర్వసభ్య సమావేశం

కౌతాళం: కౌతాళం మండల సర్వసభ్య సమావేశంను ఈనెల 13న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్బారాజు తెలిపారు. ఎంపీపీ అమరేష్ అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు హాజరై గ్రామాల్లోని సమస్యలను సభ దృష్టికి తీసుకుని రావాలన్నారు. అలాగే మండలంలోని వివిధ శాఖ అధికారులు తమ శాఖలకు సంబంధించిన వేదికలను తీసుకుని సమావేశానికి రావాలన్నారు.

ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలి

ఆదోని సెంట్రల్: మద్యం సేవించి విద్యార్థులపై దాడి చేస్తున్న ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు కోరారు. ఈ మేరకు గురువారం ఎంఈఓ రాజేంద్రకుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. మండలంలోని సంతెకూడ్లూరు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు శ్రీనివాసులు మద్యం సేవించి విద్యార్థులపై దాడి చేస్తున్నాడన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారన్నారు. వెంటనే విచారణ చేపట్టి ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి గౌస్, నాయకులు శశిధర్, నాగరాజు, రవితేజ, దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యుత్ సరఫరాలో మార్పులు

కౌతాళం: మండలంలో వ్యవసాయ విద్యుత్ సరఫరాలో మార్పును రైతులు గమనించాలని మండల ట్రాన్స్‌కో ఏఈ నర్సన్న తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు కర్నూలు నుంచి మాధవరం 132కేవీ లైన్‌లో పాతబడిన కండక్టర్‌ను తొలగించి కొత్త కండక్టర్ లాగుతున్నందున వ్యవసాయ విద్యుత్ సరఫరా వేళలు మార్చినట్లు వెల్లడించారు. ఉదయం 6 నుంచి 11గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6గంటల వరకు మరమ్మతులు ఉంటాయని ఈనెల చివరి వరకు ఈ పనులు జరిగే అవకాశం ఉందన్నారు. మార్చిన టైమింగ్‌ను రైతులు విద్యుత్ కార్యాలయంలో సంప్రదించి తెలుసుకుని, సహకరించాలని కోరారు.

నిషేధిత ప్లాస్టిక్‌ను వినియోగిస్తే కఠిన చర్యలు



వైఎస్సార్ సర్కిల్‌లోని టిఫిన్ సెంటర్‌లో తనిఖీ చేస్తున్న కమిషనర్

ఎమ్మిగనూరుటౌన్: పర్యావరణానికి ముప్పు తెచ్చే ప్లాస్టిక్‌ను వ్యాపారులు, హోటళ్ల యజమానులు ఉపయోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి హెచ్చరించారు. గురువారం పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్‌లోని గోకుల్ టిఫెన్ సెంటర్‌తో పాటు పలు దుకాణాలపై ప్లాస్టిక్ వినియోగంపై మున్సిపల్ అధికారులు దాడులు నిర్వహించారు. ఇందులో భాగంగా ఓ టిఫిన్ సెంటర్‌లో ప్లాస్టిక్ వినియోగించడంతో కమిషనర్ రూ.10వేల జరిమానా విధించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ మదన్‌కుమార్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కౌశల్ పోటీలకు నమోదు చేసుకోవాలి

ఎమ్మిగనూరురూరల్/టౌన్: ఏపీ సైన్స్, ఏపీ శాస్త్ర సాంకేతిక మండలి వారి సహకారంతో భారతీయ విజ్ఞాన మండలి ప్రతి ఏటా నిర్వహించే ప్రతిభాన్వేషణ పోటీలకు ఈ నెల 15లోగా ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కౌశల్ జాయింట్ కో–ఆర్డినేటర్ ఆడికి రంగస్వామి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వంచే నడపబడుతున్న పాఠశాలల్లో 8, 9, 10వ తరగతి చదివే విద్యార్థుల పేర్లను ఉపాధ్యాయులు నమోదు చేయాలన్నారు. క్విజ్ పోస్టర్ ప్రజెంటేషన్, షార్ట్ ఫిల్మ్ అంశాలలో పోటీలను నిర్వహిస్తారని తెలిపారు. ఈ పోటీలను ఈ నెల 20, 21, 22వ తేదీల్లో పాఠశాల స్థాయి, డిసెంబర్ 6న జిల్లా స్థాయిలో ఆన్‌లైన్లో నిర్వహిస్తారన్నారు. జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు రూ.4,500, రూ. 3000 నగదు, జ్ఞాపిక అందజేస్తారన్నారు.

బెల్ట్‌షాపులను అరికట్టడంలో విఫలం



ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ముందు బైఠాయించి నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: నియోజకవర్గ పరిధిలో విచ్చల విడిగా నిర్వహిస్తున్న బెల్ట్‌షాపులను అరికట్టడంలో ఎక్సైజ్ శాఖ పూర్తిగా విఫలమైందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రంగన్న, భాస్కర్‌యాదవ్, మండల కార్యదర్శి బీటీ చిన్నన్న ఆరోపించారు. బెల్ట్ షాపులను అరిట్టాలంటూ గురువారం సీపీఐ ఆధ్వర్యంలో పట్టణంలో ఎక్సైజ్ శాఖ పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం వినతి పత్రాన్ని ఎక్సైజ్ సీఐ రమేష్‌రెడ్డి కి వినతి పత్రాన్ని ఇచ్చారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తెచ్చిన నూతన మద్యం పాలసీ ద్వారా ప్రతి గ్రామంలో బెల్ట్ షాపులు తెరుచుకున్నాయన్నారు. 24గంటలూ ఆయా షాపులు తెరిచి పెట్టి అధిక ధరలకు విక్రయించుకుంటున్నారని ఆరోపించారు. ఈ షాపులు ఇలాగే కొనసాగితే మద్యం ప్రియులు తమ భార్య, తల్లి పుస్తెలు సైతం అమ్ముకొని మద్యం తాగుతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఎక్సైజ్ అధికారులు మొద్దు నిద్ర వీడి బెల్ట్‌షాపులను అరికట్టేలా దాడులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు సమీవుల్లా, బజారి, దాదావలి, జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు పంటల బీమా చేయించుకోవాలి



వ్యవసాయాధికారులతో మాట్లాడుతున్న జేడీఏ వరలక్ష్మి

ఎమ్మిగనూరురూరల్: రబీ సాగు చేసే రైతులు తమ పంటలకు ఇన్సూరెన్స్ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారిణి వరలక్ష్మి అన్నారు. గురువారం స్థానిక ఏడీఏ కార్యాలయంలో డివిజన్ స్థాయి వ్యవసాయాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బీమా చేయించుకోవడం వలన రైతులకు కలిగే ఉపయోగాలను తెలియజేయాలని చెప్పారు. పప్పు శనగకు ఎకరాకు రూ. 420, వరికి రూ. 630లు, జొన్నకు రూ. 207లు, వేరుశనగకు రూ. 480లు, ఉల్లికి రూ. 1350లు, టమాటకు రూ. 1500లు ప్రీమియం డిసెంబర్ 15వ తేదీలోపు చెల్లించాలని చెప్పారు. నిత్యం వ్యవసాయాధికారులు ఎరువుల దుకాణాలను తనిఖీ చేస్తుండాలని, అలాగే ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు నమూనాలు తీయాలని, ఫెయిల్ అయినవాటిపై కోర్టులో కేసు ఫైల్ చేయాలని సూచించారు. సమావేశంలో ఏడీఏ మహమ్మద్‌ఖాద్రి, ఏఓలు రాఘవేంద్ర హేమలత, స్రవంతి, గణేష్, ప్రసాద్, రాజు, శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

బైకు ఢీకొని ఇద్దరికి గాయాలు

ఆదోని అర్బన్: పట్టణంలోని ఆర్ట్స్ కళాశాల సమీపంలో గురువారం బైకు ఢీకొనడంతో విద్యుత్‌శాఖలో పనిచేస్తున్న విద్యుత్‌శాఖలో పనిచేస్తున్న లైన్‌మెన్ ఖాజా, ఆపరేటర్ రవికి గాయాలయ్యాయి. డ్యూటీ ముగించుకుని కార్యాలయానికి వెళ్తుండగా ఆర్ట్స్ కళాశాల సమీపంలో ఇద్దరు బైకుపై వెళ్తూ ఆటోను ఓవర్‌టేక్ చేసి బాధితులు ప్రయాణిస్తున్న బైకును ఢీకొట్టారు. కింద పడడంతో వెంటనే స్థానికులు ఆదోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

నందవరం : మండల కేంద్రంలోని నందవరం గ్రామ సమీపంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తగరం ప్రకాష్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలైయ్యాయి. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు గంగవరం గ్రామానికి చెందిన ప్రకాష్ పనిపై బైక్‌పై ఎమ్మిగనూరుకు వెళ్తుండగా బళ్లారి నుంచి హైదరాబాద్ వెళ్తున్న జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన దివాంషుకుమార్ కారు ఢీకొంది. తీవ్ర గాయాలపాలైన ప్రకాష్‌ను 108లో ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తీసుకెళ్లారు.

పొగాకు పంట ధ్వంసం

కౌతాళం: తన తండ్రికి సంబంధించిన పొలంలో ఆదోనికి చెందిన లక్ష్మీదేవి కుటుంబ సభ్యులు బుధవారం దౌర్జన్యంగా ప్రవేశించిన సాగు చేసిన పొగాకు పంటను ధ్వంసం చేశారని మండల పరిధిలోని కామవరం గ్రామానికి చెందిన ఉలిద్రాల జయమ్మ గురువారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కౌతాళం సీఐ అశోక్‌కుమార్ తెలిపారు.

ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలి

పెద్దకడబూరు : పేద ప్రజల ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ. 5లక్షల చొప్పున మంజూరు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు భాస్కర్ యాదవ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయం ఆవరణలో గురువారం కరపత్రాలను విడుదల చేశారు. సీపీఐ, వ్యవసాయ కార్మికసంఘం ఆధ్వర్యంలో ఈ నెల 18న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని సచివాలయాలలో పేద ప్రజలతో వ్యక్తిగత అర్జీలు అందించే ఆందోళన కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. నాయకులు వీరేష్, మబ్బు ఆంజనేయ, కుమ్మరి చంద్ర, లక్ష్మన్న, ఆంజనేయ పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పిస్తాం

పెద్దకడబూరు : నిర్ణయించిన కొలతల ప్రకారం పని చేసుకుంటే ఒక్కొక్క కూలీకి ప్రతిరోజు రూ. 300లు వేతనం పడుతుందని, కూలీలు వలస వెళ్లొద్దని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ జయరాముడు సూచించారు. మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణంలో గురువారం రాత్రి ఉపాధి కూలీలతో సమావేశమయ్యారు. మండలంలోని అన్ని గ్రామాలలో ఉపాధి పనులు చేపడుతున్నామని కూలీలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏపీఓ ఖాదర్, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

క్యాన్సర్ వ్యాధిపై జాగ్రత్తగా ఉండాలి



క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కోసిగి: ప్రతి ఒక్కరు క్యాన్సర్ వ్యాధి బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మనోజ్‌కుమార్ సూచించారు. గురువారం జాతీయ క్యాన్సర్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రాథమిక ఆరోగ్యం నుంచి పురవీధుల గుండా ఏఎన్ఎం, ఆశావర్కర్లచే ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 14వ తేదీ నుంచి ప్రతి గ్రామంలో ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు హెల్త్ సెంటర్‌ల వద్ద క్యాన్సర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరు క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ రజిత, డాక్టర్ మౌనిక, సీహెచ్ఓ ఈశ్వరమ్మ, ఎంపీహెచ్ఈఓ శ్రీనివాసులు, యల్లప్ప పాల్గొన్నారు.

గోనెగండ్ల: మండల కేంద్రంలో ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది క్యాన్సర్‌పై అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్లు రవళి, రుక్సానా, ఖాద్రీ, సీహెచ్ఓ మేరీ, ఎంపీహెచ్ఈఓ హనుమంతు, ఎంపీహెచ్ఎస్‌లు పరమేశప్ప, కృష్ణ, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

పెద్దకడబూరు: పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ తాహెర ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై ర్యాలీ, అవగాహన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో బీహెచ్ఎస్ సుశీల, సూపర్‌వైజర్లు కిశోర్‌కుమార్, లక్ష్మినరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

రేపు కోసిగిలో హెచ్‌ఆర్‌ఎఫ్ జిల్లా మహాసభలు

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో ఈనెల 9న మానవ హక్కుల వేదిక(హెచ్ఆర్ఎఫ్) 10 వ జిల్లా మహా సభలను నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యు.జి.శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షుడు కోడి ఉరుకుందప్ప తెలిపారు. గురువారం వారు కోసిగిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని కాపాకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న చట్టాలను పాలకులు నీరుగారిస్తున్నారన్నారు. చట్టాలపై ప్రజలకు అవగాహన కల్గిఉండాలన్నారు. మహాసభలకు ప్రజలు అత్యధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఇందులో ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఆవుల తిక్కయ్య, నవీన్ కుమార్‌లు ఉన్నారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

ఆదోని సెంట్రల్: ఈనెల 12, 13 తేదీల్లో ఆదోని పట్టణంలో జరిగే ఏఐఎస్ఎఫ్ 30వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.షాబీర్‌బాషా పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని విశాలాంధ్ర కార్యాలయంలో జిల్లా ఆఫీసు బేరర్ల సమావేశం జిల్లా అధ్యక్షుడు డి.సోమన్న అధ్యక్షతన నిర్వహించారు. వారు మాట్లాడుతూ విద్య ప్రైవేటీకరణ కార్పొరేటీకరణ కాషాయీకరణకు వ్యతిరేకంగా జిల్లా వ్యాప్తంగా విద్యార్థి లోకం ఉద్యమాలకు శ్రీకారం చుట్టాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.శరత్‌కుమార్, దస్తగిరి, శ్రీకాంత్, సహాయ కార్యదర్శులు రంగస్వామి, థామస్, ఈరేష్ పాల్గొన్నారు.

అఘాయిత్యాలను నిరోధించాలి

ఎమ్మిగనూరుటౌన్: చిన్నారులు, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై కఠిన చర్యలు తీసుకొని, వీటిని నిరోధించాలని పీడీఎస్ఓ జిల్లా నాయకుడు సురేంద్ర, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆర్ ఆశలు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని మగ్బుల్ ఫంక్షన్ హాల్‌లో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను ఖండిస్తూ నిర్వహించిన సభలో వారు మాట్లాడారు. విచ్చల విడిగా మద్యం షాపులు పెట్టడం వల్లనే ఇలాంటి దుర్మార్గపు ఘటనలు చోటు చేసుకుంటున్నాయన్నారు. సంఘ నాయకులు ఇమ్రాన్, ప్రతాప్, నికిత,శ్రావణి,వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

దర్గాలో ప్రత్యేక ఫాతెహాలు

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు తరలి వచ్చి స్వామి సన్నిధిలో భక్తి శ్రద్ధలతో ఫాతెహాలు, ప్రార్థనలు జరుపుకున్నారు. దీంతో దర్గా పరిసరా ప్రాంతాలన్నీ సందడిగా మారాయి. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్టీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్టీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలను చేపట్టారు.

బకాయిలు ఇప్పించాలి

ఆదోని అర్బన్: పట్టణంలోని రాయలసీమ స్పిన్నింగ్ మిల్ లిమిటెడ్‌లో వందలాది మంది కార్మికులకు రావాల్సిన గ్రాట్యూటీ, పీఎఫ్, పింఛన్, పెండింగ్‌లో ఉన్న వేతనాలను యాజమాన్యం నుంచి ఇప్పించాలని ఆదోని ఎమ్మెల్యే పార్థసారథిని కార్మికులు కోరారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో కార్మికులు వినతి పత్రం అందజేశారు. ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు ప్రసాద్, జిల్లా కార్యదర్శి వెంకప్ప, రాష్ట్ర కమిటీ సభ్యులు బి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జీవన గతిని మార్చేదే భగవద్గీత



విద్యార్థినికి భగవద్గీతను అందిస్తున్న దృశ్యం

పెద్దకడబూరు : ప్రతి వ్యక్తి జీవన గతిని మార్చేది భగవద్గీత అని తిరుమల తిరుపతి దేవస్థానము హిందూ ధర్మ ప్రచార పరిషత్ ధర్మ ప్రచార మండలి సభ్యులు శ్రీనివాసరెడ్డి, భీమిరెడ్డి అన్నారు. టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా మానవులందరికీ భగవద్గీత అనే పుస్తకాన్ని అందించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు బసన్నగౌడ్, గోసంరక్షణ ప్రముఖ్ భీమలింగారెడ్డి, సోమిరెడ్డి పాల్గొన్నారు.

రేపటి నుంచి యూటీఎఫ్ జిల్లా స్వర్ణోత్సవ మహాసభలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: ఈనెల 9,10 తేదీల్లో గూడూరులో యూటీఎఫ్ జిల్లా స్వర్ణోత్సవ మహాసభలను నిర్వహిస్తున్నట్లు ఆసంఘ నాయకులు నాగమణి, దావీదు, ఎల్లప్ప, నరసింహులు, దేవపాల్ తెలిపారు. గురువారం పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో జిల్లా స్వర్ణోత్సవ మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. మహాసభలకు ప్రతి ఉపాధ్యాయుడు హాజరుకావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యుటీఎఫ్ నాయకులు నాగరాజు, రాఘవేంద్ర, కొలన్న, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

గోనెగండ్ల : యూటీఎఫ్ 50 వసంతాల సర్ణోత్సవ మహాసభలను విజయవంతం చేయాలని యూటీ ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.నరసింహులు మండలంలోని వివిధ పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులను ఆహ్వానించారు. మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మద్దిలేటి, చంద్రపాల్, నాయకులు పాల్గొన్నారు.